సమస్యలుంటే సాక్షికి చెప్పండి
మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను మా ప్రతినిధి ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి
91829 05602
నంబర్‌లో సంప్రదించండి

క్లుప్తంగా

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

సీతమ్మధార: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని విశాఖ జిల్లా బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి బి.శ్రీనివాసరావు మంగళవారం ఓ ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంక్షేమ బోర్డును పునరుద్ధరించి పెండింగ్ క్లెయిమ్‌ల చెల్లింపు, కొత్త కార్డులు రిజిస్ట్రేషన్, రెన్యువల్ చేయాలని కోరుతూ ఈ నెల 24న రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ధర్నాలు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగా జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద భారీ ధర్నా జరుగుతుందన్నారు. ఈ ధర్నాలో భవన నిర్మాణ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొవాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం సంక్షేమ బోర్డును పునరుద్ధరించకపోతే పెద్ద ఎత్తున చలో విజయవాడ నిర్వహిస్తామని హెచ్చరించారు.

సామాజిక భవన నిర్మాణానికి శంకుస్థాపన



సామాజిక భవనానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, కార్పొరేటర్

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డు తారక రామనగర్‌లో నిరుపయోగంగా ఉన్న పార్క్ స్థలంలో సామాజిక భవనం నిర్మించేందుకు ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు స్థానిక కార్పొరేటర్ కంపా హనోకుతో కలసి మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ ప్రాంతంలో జీ+1 సామాజిక భవనం కోసం జీవీఎంసీ నిధులు రూ.38.02 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. వాస్తవానికి ఈ పనులు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలోనే మంజూరైనప్పటికీ ఎన్నికల కోడ్ కారణంగా పనులు నిలిచిపోయాయి. ఎట్టకేలకు కూటమి ప్రభుత్వం ఈ పనులకు శ్రీకారం చుట్టింది. కార్యక్రమంలో కూటమి నాయకులు నజీర్, పైలా ముత్యాలనాయుడు, పలిశెట్టి అప్పన్న, భరణికాన రాజు, ఉషాకిరణ్, సురేష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

జోరుగా 24/7 తాగునీటి పైప్‌లైన్ పనులు



శ్రీనివాసనగర్‌లో జరుగుతున్న పైప్‌లైన్ పనులు

సీతంపేట: జీవీఎంసీ 43, 44 వార్డుల్లో పలు ప్రాంతాలకు 24/7 తాగునీటి సరఫరా పైప్‌లైన్ పనులు జోరుగా సాగుతున్నాయి. అక్కయ్యపాలెం 80 అడుగుల రోడ్ నుంచి శ్రీనివాసనగర్ మీదుగా నందగిరినగర్ ప్రాంతానికి బల్క్ వాటర్ పైప్‌లైన్ వేస్తున్నారు. దీని కోసం శ్రీనివాసనగర్ ప్రధానన రహదారిని యంత్రాల సాయంతో తవ్వుతున్నారు. శ్రీనివాసనగర్, నందగిరినగర్, నరేంద్రనగర్, వెంకటేశ్వర కాలనీ ప్రాంతాల్లో వేసవిలో భూగర్భ జలాలు అడుగంటి, నీటి సమస్యను చాలా ఏళ్లుగా ఎదుర్కొంటున్నారు. ఆయా ప్రాంతాల్లో వేసవి నీటి ఎద్దడి నివారణకు ఏసియన్ బ్యాంకు నిధులతో అబిద్‌నగర్‌లోని షాదీఖానా కల్యాణ మండపం వద్ద భారీ వాటర్ ట్యాంక్ నిర్మించారు. ఈ ట్యాంకు నుంచి నీటి ఎద్దడి ప్రాంతాలకు తాగునీటిని 24/7 సరఫరా చేసేందుకు ప్రస్తుతం ప్రధాన పైప్‌లైన్ పనులు చేపడుతున్నారు. వీలైనంత త్వరగా పనులు పూర్తి చేసి నీటి సరఫరాను అందించాలని స్థానికులు కోరుతున్నారు.

కుటుంబసభ్యుల చెంతకు మహిళ



లలితను కుటుంబసభ్యులకు అప్పగిస్తున్న ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు

సీతమ్మధార: ఈ నెల 19న రైల్వే పోలీసులు రక్షించిన వివాహిత లలితను ఎట్టకేలకు ఆమె కుటుంబ సభ్యులకు అప్పగించారు. కోనసీమ జిల్లా, మండపేట మండలం, డి.కేశవరానికి చెందిన లలిత అదృశ్యంపై అన్నవరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు నమోదైంది. రైల్వే పోలీసులు లలితను గుర్తించి ఏయూటీడీ సిబ్బందికి సమాచారం అందించారు. సిబ్బంది లలితకు కౌన్సిలింగ్ ఇచ్చి వివరాలు తెలుసుకున్నారు. ఆమె తన తమ్ముడు శివన్నారాయణ ఫోన్ నంబర్ చెప్పడంతో, అతన్ని వెంటనే రప్పించి లలితను క్షేమంగా అప్పగించినట్లు ఏయూటీడీ కోఆర్డినేటర్ వాసు తెలిపారు.

బోరుమంటున్నాయి..



అరుంధతి నగర్‌లో..



ఊర్వశికూడలిలో బోరు హ్యాండిల్‌ను కొట్టేందుకు వీలులేకుండా...



అంబేడ్కర్ ఎస్టేట్‌లో చైన్ కనిపించేటట్టు ఉన్న బోరు (ఇందులో ఆకతాయిలు రాళ్లు, ఇతర వస్తువులు వేస్తున్నారు)

ఐటీఐ సిద్ధార్థ నగర్‌లో సక్రమంగా నీరు రాని బోరు



రాంజీ ఎస్టేట్‌లో మెట్లమార్గానికి అడ్డంగా బోరు ఇలా...

కంచరపాలెం: కొండవాలు ప్రాంతాల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. కుళాయి నీరు అంతంతమాత్రంగానే వస్తున్న ఈ ప్రాంతాల్లో బోర్లు కూడా పూర్తి స్థాయిలో పనిచేయక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. జీవీఎంసీ 47, 54, 55 వార్డుల్లో ఈ పరిస్థితి నెలకొంది.

జోన్–5 పరిధిలోని చాలా ప్రాంతాల్లో చేతి పంపులు(బోర్లు) నిరుపయోగంగా మారాయి. రాంజీ ఎస్టేట్, కప్పరాడ, అరుంధతి నగర్, అంబేద్కర్ ఎస్టేట్, సంజీవయ్య కాలనీ, బాపూజీనగర్, సిద్ధార్థ నగర్, ఐటీఐ జంక్షన్, గజపతినగర్, ఊర్వశి కూడలి గౌరీనగర్, తుమ్మడపాలెం.. ఇలా అనేక చోట్ల వీధి బోర్లు మరమ్మతులకు గురయ్యాయి. వీటిలో సక్రమంగా పని చేయనివి కొన్ని.. నిరుపయోగంగా ఉన్నవి మరికొన్ని కనిపిస్తున్నాయి. కొండవాలు ప్రాంతాల్లో వేసవిలో వీటి సమస్య మరీ ఎక్కువగా కనిపిస్తోంది. ఆ సమయంలో వారికి ఈ బోర్లే ఆధారం. అధికారులు స్పందించి, బోర్లకు అవసరమైన మరమ్మతులు చేయిస్తే నీటి ఇబ్బందులు తొలగుతాయని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఇదీ పరిస్థితి..

- కొన్ని చోట్ల బోర్లు పనిచేస్తున్నా, వాటి బేస్‌మెంట్లు శిథిలావస్థలో ఉన్నాయి.
- మెట్లమార్గంలో కొన్ని బోర్లు అడ్డుగా ఉండగా.. హ్యాండిల్స్ కొట్టేందుకు వీల్లేని ప్రాంతాల్లో మరికొన్ని ఉన్నాయి.
- కొన్ని ప్రాంతాల్లో హ్యాండిల్స్ పని చేయడం లేదు.
- బోర్ హ్యాండిల్స్ ఎక్కువ సేపు కొడితే తప్ప నీరు రానివి మరికొన్ని ఉన్నాయి.
- కొన్ని బోర్ల నుంచి బురద, నురగ నీరు పడుతుందని చెబుతున్నారు.
- పనిచేయని బోర్లకు తక్షణమే మరమ్మతులు చేయాలని, శిథిలావస్థలో ఉన్న బేస్‌మెంట్లకు కొత్త సిమెంటు దిమ్మలు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. తుప్పుపట్టిన హ్యాండిల్స్, బోర్లు స్థానంలో కొత్తవాటిని వేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఇప్పటికైనా జోన్–5 మంచి నీటి విభాగాధికారులు పరిశీలించి, చేతిపంపుల సమస్యలకు పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

నీరు పట్టేందుకు చోటేది?

ఊర్వశికూడలి గౌరీనగర్‌లో బీఆర్‌టీఎస్‌ను ఆనుకుని ఉన్న మంచినీటి బోరు హ్యాండిల్ వరకు రోడ్డు వేశారు. దీంతో నీరు పట్టేందుకు ఇబ్బంది పడుతున్నాం. సిబ్బందికి చెప్పినా పట్టించుకోవడం లేదు. దగ్గరే బోరు ఉన్నా దూరం వెళ్లాల్సిన పరిస్థితి.

– కె.రాజ్యలక్ష్మి, స్థానికురాలు, గౌరీనగర్, ఊర్వశి కూడలి

వేసవిలో ఎంతో ఆసరా

ఈ వేసవిలో మాకు బోర్లు ఎంతో ఆసరా. వీధి కుళాయిలు రాని సమయంలో బోరు నీటినే అంతా వాడుకుంటున్నాం. పాడైన బోర్లకు వెంటనే మరమ్మతులు చేయిస్తే మాకు, మా ప్రాంతంలో వారికి ఎంతో ఉపయోగం. కొత్త బోర్లు వేయమని అడగటం లేదు, ఉన్నవాటినైనా బాగు చేసి, వినియోగంలోకి తేవాలని కోరుతున్నాం.

– వై.ఝాన్సీలక్ష్మి, రాంజీ ఎస్టేట్, కంచరపాలెం

ఎస్సీ, ఎస్టీ సెల్ డీఎస్పీలను నియమించాలి



మాట్లాడుతున్న బహుజన సేన రాష్ట్ర అధ్యక్షుడు చందు

సీతంపేట: రాష్ట్రంలో గతేడాది గుట్టుచప్పుడు కాకుండా 98 మంది డీఎస్పీలను ఎస్సీ, ఎస్టీ సెల్ పోలీస్ స్టేషన్ల నుంచి తొలగించారని బహుజన సేన రాష్ట్ర అధ్యక్షుడు చందు ఆరోపించారు. 'ఆంధ్రప్రదేశ్‌లో తొలగించిన ఎస్సీ, ఎస్టీ సెల్ డీఎస్పీలను నియమించాలి'అనే అంశంపై ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో మంగళవారం జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టాన్ని బలపర్చడానికి, బాధితులకు సత్వర న్యాయం అందించేందుకు జస్టిస్ పున్నయ్య కమిషన్ సిఫార్సుల ద్వారా 2014లో స్పెషల్ డీఎస్పీల వ్యవస్థ ఏర్పడిందన్నారు. 2024లో ఎస్సీ, ఎస్టీ సెల్ డీఎస్పీలను తొలగించినప్పటికీ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సమస్య పరిష్కారానికి కృషి చెయ్యలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని గత నెలలో డీజీపీ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదన్నారు. సీఎం చంద్రబాబు, డీసీఎం పవన్‌కల్యాణ్‌లు జోక్యం చేసుకుని ఈ డీఎస్పీలను నియమించాలని కోరారు. సమావేశంలో దళిత సంఘాల నాయకులు బొడ్డు కల్యాణరావు, బూసి వెంకటరావు, చిన్నారావు, దుర్గారావు, అప్పలరాజు, బొడ్డు కృష్ణమూర్తి, పృథ్వీరాజ్, గిన్నెల మనోహర్‌రెడ్డి, రూపనాయక్, భానుప్రకాష్, బన్నీ తదితరులు పాల్గొన్నారు.

వడమాలతో యోగ సిద్ధాంజనేయుడికి అర్చన



ప్రత్యేక అలంకరణలో యోగసిద్ధాంజనేయుడు

మురళీనగర్: జాతీయ రహదారి సూర్యానగర్–2లో వెలసిన యోగ సిద్ధాంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు శ్రీకాంతాచార్యులు ఆధ్వర్యంలో మూలవిరాట్‌కు పాంచరాత్ర ఆగమ రీతిలో సింధూర అర్చన చేశారు. ఈ సందర్భంగా స్వామికి వడమాల సమర్పించారు. భక్తులు సామూహిక సుందరాకాండ పారాయణం చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామిని దర్శించుకుని, తీర్థప్రసాదాలు సేవించారు. ఆలయ వ్యవస్థాపకులు పెనుమత్స సుబ్బరాజు, యశోద దంపతులు, ఆలయ కమిటీ సభ్యులు, ఆధ్యాత్మిక వేత్త ఎంపీ రాజశేఖర్ పాల్గొన్నారు.

భావి తరాల కోసం పర్యావరణాన్ని పరిరక్షిద్దాం



రామకృష్ణారెడ్డిని సత్కరిస్తున్న వాకర్స్ క్లబ్ ప్రతినిధులు

మురళీనగర్: భావితరాల మేలు కోసం పర్యావరణ పరిరక్షణను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని వాకర్స్ క్లబ్ పూర్వ అధ్యక్షుడు ఎ.రామకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. మురళీనగర్ వాకర్స్ పార్కులో వాకర్స్ క్లబ్ సమావేశాన్ని క్లబ్ అధ్యక్షుడు సనపల భానుప్రకాష్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాకర్స్‌లో పర్యావరణ పరిరక్షణ పట్ల అవగాహన పెంచాలని కమిటీ సభ్యులకు సూచించారు. అధ్యక్షుడు భానుప్రకాష్ మాట్లాడుతూ ఈ నెల 27న మ్యాక్సివిజన్ ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థుల్లో క్రీడల పట్ల ఆసక్తి పెంచేందుకు 28 నుంచి ఇండోర్ చెస్ ఉచిత శిక్షణ, మే 6 నుంచి పాట్ అండ్ గ్లాస్ పెయింటింగ్, శారీ పెయింటింగ్, చిత్రలేఖనంపై శిక్షణ అందించనున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డిని సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పూర్వ అధ్యక్షుడు ఎస్.బుచ్చయ్య, కార్యదర్శి సీహెచ్ ప్రసాదరావు, ఇతర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నార్త్ ఎక్స్‌టెన్షన్‌లో ట్రాఫిక్ టెన్షన్



సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్షన్ మెయిన్ రోడ్డుపైనే పార్కింగ్ చేసిన లారీ, వాహనాలు

సీతమ్మధార: జీవీఎంసీ 14వ వార్డు పరిధి సీతమ్మధార దరి నార్త్ ఎక్స్‌టెన్షన్ కాలనీలో ట్రాఫిక్ కష్టాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ఇక్కడ ఓ ఆస్పత్రి నిర్మాణం జరుగుతుండటంతో అందుకు వినియోగిస్తున్న భారీ వాహనాల పార్కింగ్ ప్రధాన కారణమని స్థానికులు ఆరోపిస్తున్నారు. సమీపంలోనే ఇతర వాహనాలు కూడా అనధికారికంగా పార్కింగ్ చేస్తుండటంతో పాదచారులు, వాహనదారులు అవస్థలు పడుతున్నారు. ఇక్కడ ఓ బాలయ్యశాస్త్రి లే అవుట్ రోడ్డులో ట్రాఫిక్ కష్టాలు కొనసాగుతుండగా, ఎదురుగా వున్న సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్సన్ కాలనీ షాపింగ్‌కాంప్లెక్సు ఎదుటనే వాహనాల పార్కింగ్ చేయడాన్ని వాహనదారులు ఆక్షేపిస్తున్నారు. ఇక్కడి మెయిన్‌రోడ్డులోని వాణిజ్య సముదాయాలు, కల్యాణమండపాలకు వచ్చే వినియోగదారులు, ప్రజలు తమ వాహనాలను సెల్లార్లో కాకుండా రోడ్డుమీదనే పార్కింగ్ చేస్తున్నా.. నియంత్రించే నాథుడు లేడు. ఈ మార్గంలో ఎక్కడా ట్రాఫిక్ కానిస్టేబుల్ బీట్ సైతం లేదు. దీంతో వాహనచోదకుల పార్కింగ్‌కు అడ్డూ అదుపూ లేకుండా పోతోందని స్థానికులు ఆక్షేపిస్తున్నారు. ఇప్పటికైనా ద్వారకా పోలీసులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

19 కిలోల గంజాయి స్వాధీనం

రెండు కేసుల్లో ముగ్గురు నిందితులకు రిమాండ్



రైల్వేస్టేషన్‌లో అదుపులోకి తీసుకున్న గంజాయి నిందితులతో జీఆర్పీ, ఆర్పీఎఫ్ సిబ్బంది

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో గంజాయి అక్రమంగా రవాణా చేస్తున్న నిందితులను రెండు వేర్వేరు కేసుల్లో రైల్వేపోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకుని వారి నుంచి గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గవర్నమెంట్ రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు... జీఆర్పీ ఉన్నతాధికారుల ఆదేశాలతో ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ధనుంజయ నాయుడు ఆధ్వర్యంలో ఎస్ఐ కేటీఆర్ లక్ష్మి, ఆర్పీఎఫ్ ఏఎస్ఐ ఎస్.చిట్టిబాబులు తమ సిబ్బందితో కలిసి విశాఖ రైల్వేస్టేషన్‌లో ముమ్మర తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఒడిశాలోని రాయగడ జిల్లాకు చెందిన లక్ష్మణ్ అధికారి, పి.రవిలు విశాఖ మీదుగా సికింద్రాబాద్‌కు గంజాయి అక్రమ రవాణా చేస్తున్నట్లు గుర్తించారు. వీరిని అదుపులోకి తీసుకుని వీరి నుంచి రూ.55 వేల విలువైన 11 కిలోల గంజాయిని స్వాధీనం చేసు కున్నారు. ముద్దాయిలను రిమాండ్ నిమిత్తం కోర్టు లో హాజరుపర్చినట్లు జీఆర్పీ అధికారులు తెలిపారు.

మరో కేసులో జీఆర్పీ ఎస్ఐ కె.శాంతారాం, ఆర్పీఎఫ్ ఎస్ఐ ఒ.మిస్త్రీలు తమ సిబ్బందితో తనిఖీలు నిర్వహిస్తుండగా మహారాష్ట్రలోని జల్నా జిల్లాకు చెందిన ఖాసిమ్ షేక్ బాబు గంజాయి రవాణా చేయడాన్ని గుర్తించి, అదుపులోకి తీసుకున్నారు. అతని నుంచి రూ.40 వేల విలువైన 8 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.

సమస్త జీవరాశిపైనే మానవాళి మనుగడ



పర్యావరణ పరిరక్షణ ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు, సభ్యులు

తాటిచెట్లపాలెం: భూగోళం సమస్త జీవరాసులతో కలకాలం కళకళలాడాలని ఏయూ పర్యావరణ విభాగాధిపతి ఆచార్య ఈయూబీ రెడ్డి ఆకాంక్షించారు. మాధవధారలోని ఏపీ కాలుష్య నియంత్రణ మండలి కార్యాలయంలో మంగళవారం ధరిత్రి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్త జీవరాశిని కాపాడుకోవాల్సిన బాధ్యత మానవాళిదేనన్నారు. ఏ జీవి అంతరించినా ఆ ప్రభావం మానవాళిపై పడుతుందన్నారు. ఏపీ రీజనల్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ పీవీ ముకుందరావు మాట్లాడుతూ ధరిత్రీ దినోత్సవాన వేడుకలు జరపడం కాదని, నిరంతరం పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా నిర్వహించిన చిత్ర లేఖనం పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఏపీ పీసీబీ ఎస్ఈలు రామారావు నాయుడు, నాగిరెడ్డి, ఈఈ శ్రీనివాస్, ఏఎం శ్రీనివాస్, గ్రీన్ క్లైమేట్ వ్యవస్థాపక కార్యదర్శి జేవీ రత్నం, గ్రీన్ వలంటీర్లు జె.రాజేశ్వరి, ఐ.కృష్ణకుమారి, జె.రవితేజ తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన



అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వ హించిన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు.

పదోన్నతిపై వెళ్తున్న గురువులకు సత్కారం



ఇద్దరు హెచ్‌ఎంలను ఘనంగా సత్కరిస్తున్న హెచ్‌ఎం రాంప్రసాద్, ఉపాధ్యాయులు

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డు పీ అండ్ టీ కాలనీలోని నెహ్రూ మున్సిపల్ హైస్కూల్ ప్లస్‌లో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు పీజీటీలు పదోన్నతిపై ప్రధానోపాధ్యాయులుగా వెళ్తున్న సందర్భంగా వారిని మంగళవారం ఘనంగా సన్మానించారు. గణిత పీజీటీ జి.జి. ప్రియదర్శిని, వృక్షశాస్త్ర పీజీటీ ఇ. భవానీ 2024 నవంబర్‌లో గ్రేడ్–2 హెచ్‌ఎంలుగా పదోన్నతి పొందారు. ప్రియదర్శిని శ్రీహరిపురం హైస్కూల్ హెచ్‌ఎంగా, భవానీ భీమిలి జీవీఎంసీ హైస్కూల్ హెచ్‌ఎంగా బదిలీపై వెళ్తున్నారు. ఈ సందర్భంగా ఎన్‌ఎంసీహెచ్ స్కూల్లో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో హెచ్‌ఎం డి.రాంప్రసాద్ ఆధ్వర్యంలో వారిని ఘనంగా సత్కరించారు. ఆయన మాట్లాడుతూ టెన్త్, ఇంటర్ విద్యార్థుల ఉత్తీర్ణతలో వారిద్దరూ ప్రముఖ పాత్ర వహించారని కొనియాడారు.

ఎన్‌ఎంసీహెచ్‌లో టీచర్‌గా చేస్తున్న బెండి ప్రసాద్ మే 31వ తేదీన ఉద్యోగ విరమణ చేస్తున్న సందర్భంగా మంగళవారం ఆయనకు ఘనంగా వీడ్కోలు పలికారు. ఆయన్ను దుశ్శాలువాతో సత్కరించారు. హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పన్నుల వసూళ్లు వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న డీసీఆర్ శ్రీనివాస్

జగదాంబ: ఆస్తి , నీటి పన్నుల వసూలు ప్రక్రియను వేగవంతం చేయాలని డిప్యూటీ కమిషనర్ ఆఫ్ రెవెన్యూ శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సూర్యాబాగ్ జోనల్ కార్యాలయంలో జోనల్ కమిషనర్ ఎం. మల్లయ్యనాయుడుతో కలిసి రెవెన్యూ అధికారులు, సెక్రెటరీలు, ట్యాక్స్ కలెక్టర్లతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం కల్పిస్తున్న 50 శాతం వడ్డీ రాయితీపై అవగాహన కల్పించి బకాయిలు పరిష్కరించేలా చూడాలని సూచించారు. ప్రస్తుతం అమల్లో ఉన్న 5 శాతం వడ్డీ రాయితీని సద్వినియోగం చేసుకునేలా ప్రజలు త్వరగా పన్నులు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ నెల 30వ తేదీ వరకు మాత్రమే రాయితీ అవకాశం ఉందన్నారు. సచివాలయాల పరిధిలోని సెక్రెటరీలు , రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు (ఆర్ఐలు) నిర్దేశించిన లక్ష్యాలను చేరుకుని, ఏప్రిల్ నెలాఖరు నాటికి ఆస్తి పన్ను, నీటి పన్నుల వసూలును పూర్తి చేయాలని శ్రీనివాస్ స్పష్టం చేశారు. పన్ను చెల్లింపుదారుల నుంచి నేరుగా చెక్కులు తీసుకోకుండా, కమిషనర్ జీవీఎంసీ పేరుతో డిమాండ్ డ్రాఫ్టులు (డీడీలు) మాత్రమే స్వీకరించాలని ఆయన సూచించారు. సమావేశంలో ఆర్వోలు పడాల్, అప్పలరాజు, ఆర్ఐలు సీతారాం, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎస్.జానకి ప్రత్యేక సినీ సంగీత విభావరి

మద్దిలపాలెం: ప్రముఖ సినీ నేపథ్య గాయని ఎస్. జానకి 87వ జన్మదినోత్సవం సందర్భంగా బుధవారం సాయంత్రం 6.30 గంటల నుంచి కళాభారతి ఆడిటోరియంలో సినీ సంగీత విభావరి జరగనుంది. యాక్సీ, జయంతి చౌదరి క్రియేషన్స్ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాయి అని యాక్సీ ప్రతాప్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రముఖ బెంగాలీ నృత్య దర్శకురాలు సువశ్రీ బగ్చిని ఉగాది పురస్కారంతో సత్కరించనున్నారు. నగరానికి చెందిన ప్రముఖ గాయనీ గాయకులు ఆర్ సత్య, సుజాత, ఆనంద్, అనూష, కళ్యాణి ఎస్. జానకి పాడిన మధురమైన గీతాలను ఆలపించనున్నారు.

కేజీహెచ్‌ను సందర్శించిన అదనపు డీఎంఈ



కేజీహెచ్ సూపరింటెండెంట్‌కు సూచనలు చేస్తున్న అదనపు డీఎంఈ

దాబాగార్డెన్స్: అదనపు డీఎంఈ డాక్టర్ డి. వేంకటేశ్వరరావు మంగళవారం కింగ్ జార్జ్ హాస్పటల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ప్రమాద విభాగం (క్యాజువల్టీ)ను పరిశీలించి, రోగులకు మరింత నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు పలు సూచనలు చేశారు. అనంతరం ఆస్పత్రి సూపరింటెండెంట్ కార్యాలయంలో నర్సింగ్ సూపరింటెండెంట్‌తో నర్సింగ్ సిబ్బంది రోస్టర్లపై చర్చించారు. త్వరలో ప్రారంభించనున్న కొత్త వార్డులను కూడా పరిశీలించారు. ఆంధ్ర వైద్య కళాశాల ప్రిన్సిపల్, కేజీహెచ్ సూపరింటెండెంట్, ఇతర ఆస్పత్రి ప్రతినిధులు, వివిధ విభాగాల అధిపతులు, ప్రొఫెసర్లతో డాక్టర్ వేంకటేశ్వరరావు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రోగుల సంరక్షణకు అవసరమైన వైద్య పరికరాలను జెమ్ పోర్టల్ ద్వారా కొనుగోలు చేయాలని ఆయన సూచించారు. ముఖ్యంగా వైద్యులు సమయపాలన పాటించాలని, ఎన్టీఆర్ వైద్య సేవల కేసుల సంఖ్యను పెంచాలని ఆయన ఆదేశించారు.

మే 10,11 తేదీల్లో సీపీఐ జిల్లా మహా సభలు



మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీపీఐ జిల్లా సమితి సభ్యులు

అల్లిపురం: సీపీఐ జిల్లా మహాసభలు మే 10, 11 తేదీల్లో మురళీనగర్‌లో నిర్వహించనున్నట్లు పార్టీ జిల్లా సమితి సభ్యులు తెలిపారు. ఈ మేరకు మహాసభల పోస్టర్లను అల్లిపురంలోని సీపీఐ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మరుపల్లి పైడిరాజు, జిల్లా కార్యవర్గ సభ్యులు కె. సత్యనారాయణ, కె. సత్యాంజనేయ, ఎం. మన్మథరావు, జి.రాంబాబు, సీఎస్. క్షేత్రపాల్ రెడ్డి, ఎస్. సూరిబాబు తదితరులు ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ సింహాచలం దేవస్థానం పంచగ్రామాల భూసమస్యను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పరిశ్రమల నుంచి విడుదలవుతున్న కాలుష్యాన్ని అరికట్టి ప్రజల ప్రాణాలు కాపాడేందుకు పోరాటాలు చేస్తామని వారు తెలిపారు. నగరంలో ఐటీ అభివృద్ధి తదితర సమస్యలను మహాసభల్లో చర్చించి భవిష్యత్ కార్యాచరణను రూపొందిస్తామని వెల్లడించారు.

క్రికెట్ పోటీల్లో ఏఎంసీకి కాంస్యం



కాంస్య పతకం సాధించిన ఏఎంసీ జట్టుతో కళాశాల ప్రిన్సిపాల్ సంధ్యాదేవి

దాబాగార్డెన్స్: ఆంధ్ర వైద్య కళాశాల (ఏఎంసీ) విద్యార్థులు ఏపీ స్టేట్ మెడికల్ అండ్ డెంటల్ కాలేజ్ క్రికెట్ టోర్నమెంట్‌లో కాంస్య పతకం సాధించారు. డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ సైన్సెస్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో నెల్లూరులోని నారాయణ మెడికల్ కళాశాలలో ఈ నెల 16 నుంచి 20 వరకు ఈ పోటీలు జరిగాయని ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ఎంఎస్ఎస్ పాత్రుడు తెలిపారు. మంగళవారం ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీఎస్ఎం సంధ్యాదేవి, వైస్ ప్రెసిడెంట్ (క్రీడలు) డాక్టర్ ఆర్. సునీల్ కుమార్, ఫిజికల్ డైరెక్టర్ పాత్రుడు, జట్టు కెప్టెన్ వీజీఎస్ కార్తీక్, వైస్ కెప్టెన్ పి. ఠాగోర్ ప్రసాద్, జట్టు సభ్యులను అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి కళాశాల కీర్తిని మరింత ఇనుమడింపజేయాలని వారు ఆకాంక్షించారు. ఈ టోర్నమెంట్‌లో మొత్తం 40 జట్లు పాల్గొన్నట్లు ఫిజికల్ డైరెక్టర్ పేర్కొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వైజాగ్ నార్త్
9010810033
Office mail : sakshiadvtvsp@gmail.com